8 వేలకే5జీ స్మార్ట్‌ఫోన్!

న్యూఢిల్లీ, జూలై 30: తమ చిప్‌సెట్‌తో భారత్‌లో 5జీ స్మార్ట్‌ఫోన్ ధర రూ.8,000, అంతకన్నా దిగువకు చేరగలదని అమెరికా చిప్ తయారీ దిగ్గజం క్వాల్‌కామ్ అన్నది. మంగళవారం స్నాప్‌డ్రాగన్ 4ఎస్ జెన్ 2 చిప్‌సెట్‌ను సంస్థ ఆవిష్కరించింది. ఆరంభ శ్రేణి మొబైల్ ఫోన్ల కోసం తెచ్చిన ఈ చిప్‌తో భారత్‌లోని 60 కోట్లకుపైగా మొబైల్ వినియోగదారులకు చౌక ధరలకే 5జీ స్మార్ట్‌ఫోన్‌ను సొంతం చేసుకునే వీలు కలుగుతుందన్న విశ్వాసాన్ని క్వాల్‌కామ్ వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 5జీ స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధర రూ.9,999 గా ఉన్నది. ఈ క్రమంలో క్వాల్‌కామ్ ప్రకటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. డిసెంబర్‌లోగా షియామీ తదితర బ్రాండ్లు చౌక స్మార్ట్‌ఫోన్లను తీసుకురాచ్చని అంచనా.

గ్రాన్యూల్స్ లాభం మూడింతలు

హైదరాబాద్, జూలై 30: గ్రాన్యూల్స్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభాన్ని రూ.135 కోట్లు ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.48 కోట్ల కంటే ఇది మూడింతలు అధికం. అటు ఆదాయం కూడా రూ.985 కోట్ల నుంచి రూ.1,180 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ..గత త్రైమాసికంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకున్నట్లు, ఎదురు దెబ్బలు తగిలిన తర్వాత తిరిగి పుంజుకోగలిగామని చెప్పారు.

ఐవోసీ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, జూలై 30: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) లాభాలకు రిఫైనింగ్, మార్కెట్ మార్జిన్లు గండికొట్టాయి. జూన్‌తో ముగిసిన మూడు నెలలకాలానికిగాను కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 81 శాతం తగ్గి రూ.2,643.18 కోట్లకు పరిమితమైనట్లు పేర్కొంది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.13,750 కోట్ల లాభాన్ని గడించింది. బ్యారెల్ క్రూడాయిల్‌ను శుద్ధి చేయడంతో సంస్థకు 6.39 డాలర్ల ఆదాయం లభించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.15 లక్షల కోట్లు ఆర్జించింది.

8,500 కోట్లు పిండేశారు

ఖాతాల్లో కనీస నగదు నిల్వల్లేవని జరిమానాలు • ఇదీ సర్కారీ బ్యాంకుల తీరు • సామాన్యులే బాధితులు

న్యూఢిల్లీ, జూలై 30: ప్రభుత్వ రంగ బ్యాంకులంటేనే పేద, మధ్యతరగతి వర్గాల ఖాతాదారులు ఎక్కువగా ఉంటారు. అయితే అలాంటివారి ఖాతాల్లోనూ కనీస నగదు నిల్వలు ఉండట్లేదంటూ బ్యాంకులు ఎడాపెడా చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఇలా 2019-20 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరాల మధ్య మినిమం బ్యాలెన్స్‌ను మెయింటెన్ చేయని ఖాతాదారుల నుంచి జరిమానాల రూపంలో ఏకంగా రూ.8,500 కోట్లు దేశంలోని సర్కారీ బ్యాంకులు తీసుకోవడం గమనార్హం. అయితే అన్నివైపులా విమర్శలు రావడంతో భారతీయ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ఈ మినిమం బ్యాలెన్స్‌ను 2020-21 నుంచి పక్కనబెట్టింది. మిగతా బ్యాంకులు మాత్రం కొనసాగిస్తూనే ఉన్నాయి. ఇక గడిచిన 5 ఆర్థిక సంవత్సరాల్లో గత ఆర్థిక సంవత్సరమే (2023-24) అత్యధికంగా రూ.2,331 కోట్లను బ్యాంకర్లు వసూలు చేశారు. అంతకుముందుతో పోల్చితే ఈ ఐదేండ్లలో ఈ వసూళ్లు 34 శాతానికిపైగా పెరగడం గమనించదగ్గ అంశం.

టాప్-5 బ్యాంకులివే..

ప్రస్తుతం దేశంలో మొత్తం 12 ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి. అయితే ఖాతాల్లో కనీస నగదు నిల్వల్లేవని అత్యధికంగా ఫైన్లు వసూలు చేసిన బ్యాంకుల్లో పీఎన్‌బీ, బీవోబీ, ఇండియన్ బ్యాంక్, కెనరా, బీవోఐ టాప్-5గా ఉన్నాయి. ఎస్బీఐ ఒక్క 2019-20లో గరిష్ఠంగా రూ.640 కోట్లు వసూలు చేసినట్టు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి అందించిన లెక్కలు చెప్తున్నాయి. ఆ తర్వాత నుంచి ఆపేసిందన్నారు. కాగా, ఆయా ప్రభుత్వ బ్యాంకులు మెట్రోలు-నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల శాఖలవారీగా సేవింగ్స్ ఖాతాల్లో కనీస నగదు నిల్వలు రూ.2 వేల నుంచి రూ.500 వరకు ఉండాలని చెప్తున్నాయి. లేకుంటే నెలనెలా రూ.250 నుంచి రూ.100దాకా జరిమానాలు వేస్తున్నాయి. ఇక కరెంట్ ఖాతాల్లో రూ.10 వేల నుంచి రూ.1,000 వరకు ఉంచాల్సిందే. లేకపోతే గరిష్ఠంగా రూ.600దాకా ఫైన్ పడుతుంది.

12 పీఎస్‌బీలకు జరిమానా బోనాంజా (రూ.కోట్లలో)

	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
మొత్తం	1,738	1,142	1,429	1,855	2,331
	టాప్-5 ప్రభుత్వ రంగ బ్యాంకులు				
ఎస్బీఐ	640	0	0	0	0
పీఎన్‌బీ	238	141	86	440	633
బీవోబీ	105	118	307	333	383
ఇండియన్ బ్యాంక్	141	343	317	296	369
కెనరా బ్యాంక్	240	177	230	226	284
బ్యాంక్ ఆఫ్ ఇండియా	182	121	150	180	194

కార్పొరేట్లు కోట్లు ఎగ్గొడుతున్నా..

కార్పొరేట్ సంస్థలు వందలు, వేల కోట్ల రూపాయల్లో రుణాలు తీసుకుని, చివరకు వాటిని ఎగవేసి దర్జాగా తిరిగేస్తున్నారు. అయినా వారిని ఏమీ చేయలేకపోతున్న బ్యాంకర్లు.. సామాన్యులపై మాత్రం కన్నెర్రజేస్తుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. దేశంలో అందరికీ బ్యాంకింగ్ సేవల్ని అందిస్తున్నామంటూ ఊదరగొడుతున్న మోదీ సర్కారు.. ఈ జరిమానాలపై నోరు మెదపట్లేదన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో అందర్నీ భాగస్వాములను చేయడం అంటే ఇదేనా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిజానికి నెలాఖర్లో చేతిలో ఒక్క రూపాయి కూడా ఉండని బడుగు, బలహీన వర్గాలు.. ఖాతాల్లో అంతంత నగదును ఎలా? ఉంచగలుగుతారు. పింఛన్ కోసమో, సబ్సిడీల కోసమో లేక మరే ఇతర అవసరాల కోసమో వృద్ధులు, రైతన్నలు, శ్రామికులు తీస్తున్న ఈ ఖాతాల్లో కనీస నగదు నిల్వల్లేవంటూ జరిమానాల పేరిట సర్కారీ బ్యాంకులు విరుచుకుపడటం ఎంతమాత్రం సరికాదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికైనా ప్రభుత్వ బ్యాంకుల్లో ఈ తరహా విధానాలను తొలగించాలన్న డిమాండ్ గట్టిగా వస్తున్నది.

25 లక్షలకుమించి ఉద్దేశపూర్వక డిఫాల్టర్లపై లుక్కేయండి..

బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ సూచన

ముంబై, జూలై 30: ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు రిజర్వు బ్యాంక్ మరో షాకిచ్చింది. ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సెంట్రల్ బ్యాంక్ తాజాగా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రూ.25 లక్షలు అంతకంటే ఎక్కువ మొత్తంలో ఉన్న అన్ని నిరర్థక ఆస్తుల ఖాతాల్లో ఉద్దేశ పూర్వక ఎగవేతదారుల అంశాన్ని పరిశీలించాలని మంగళవారం ప్రత్యేక సూచనలు చేసింది. ప్రస్తుతం రుణాలను తీసుకున్న వారు తిరిగి చెల్లింపులు జరపలేకపోతే వారిని ఉద్దేశపూర్వక డిఫాల్టర్‌గా ప్రకటించడం జరుగుతున్నది. రూ.25 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ రుణం తీసుకొని ఎగ్గొట్టిన వారు లేదా వీరికి గ్యారెంటీగా ఉన్న వారు కూడా విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా గుర్తించనున్నారు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో ఉన్న అన్ని నిరర్థక ఆస్తుల ఖాతాలకు సంబంధించి తిరిగి రుణాలు ఆరు నెలల్లో చెల్లింపులు జరపకపోనటువంటి ఖాతాలను విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా గుర్తించనున్నారు. వీటిని గుర్తించేటప్పుడు అంతర్గతంగా పరిశీలించిన తర్వాతనే ఆ ఖాతాలను ఎన్‌పీఏగా ప్రకటిస్తారు.

డెరివేటివ్ ట్రేడింగ్ మరింత కఠినతరం!

న్యూఢిల్లీ, జూలై 30: డెరివేటివ్ ట్రేడింగ్ నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాలపాడటంలో భాగంగా స్పెక్యూలేషన్‌ను అరికట్టడానికి కనీస కాంట్రాక్ట్ విలువ, ఆప్షన్ ప్రీమియంలను ముందస్తు సేకరణ అవసరమని సూచించింది. ఫ్యూచర్స్, ఆప్షన్ ట్రేడ్‌లపై సెక్యూరిటీస్ ట్రాన్సక్షన్ ట్యాక్స్‌ను పెంచుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయం కొన్ని రోజుల తర్వాత సెబీ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. డెరివేటివ్ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు పెరగడంపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. వారాంతపు ఇండెక్స్‌లను హేతుబద్ధీకరించడంతోపాటు పరిమితులను ఎల్లప్పుడూ పర్యవేక్షించాలని పేర్కొంది. ఈ ప్రతిపాదనలపై ఆగస్టు 20లోగా ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించాలని సెబీ సూచించింది.

విస్తారా ఉద్యోగులకు వీఆర్ఎస్

న్యూఢిల్లీ, జూలై 30: దేశీయ విమాన యాన రంగ సంస్థ విస్తారా.. తమ పర్మనెంట్ గ్రౌండ్ స్టాఫ్‌కు వాలంటరీ రిటైర్మెంట్ స్కీం (వీఆర్ఎస్), వాలంటరీ సపరేషన్ స్కీం (వీఎస్ఎస్)లను తాజాగా ప్రకటించింది. ఎయిర్ ఇండియాలో విలీనం కానున్న క్రమంలో ఇదిప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఎయిర్ ఇండియా సైతం ఇప్పటికే తమ నాన్-ఫ్లైయింగ్ పర్మనెంట్ స్టాఫ్‌కు ఇదే తరహా ప్లాన్లను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఐదేండ్లుగా సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది వీఆర్ఎస్‌ను ఎంచుకోవచ్చని విస్తారా ఈ సందర్భంగా తెలియజేసింది. అలాగే సంస్థలో ఐదేండ్ల కంటే తక్కువ అనుభవం ఉన్నవారు వీఎస్ఎస్‌ను తీసుకోవచ్చు. వచ్చే ఏడాది మార్చి 31లోగా పదవీ విరమణ పొందే పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఇతర ఉద్యోగులెవరైనాసరే ఈ పథకాలకు అనర్హులు.

ఐపీవోకి నాలుగు సంస్థలు

న్యూఢిల్లీ, జూలై 30: స్టాక్ మార్కెట్లోకి లిస్ట్ కావడానికి మరో నాలుగు సంస్థలు రెడీ అవుతున్నాయి. ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్‌తో పాటు పీఎన్ గాడ్జిల్ జ్యూవెల్లరీస్ లిమిటెడ్, ఎకోస్ ఇండియా మొబిలిటీ, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ సంస్థల ఐపీవోలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిలో ప్రీమియర్ ఎనర్జీ రూ.1,500 కోట్లు, పీఎన్ గాడ్జిల్ జ్యూవెల్లరీ రూ.1,100 కోట్లు, ఎకోస్ ఇండియా 250 కోట్లు, కేఆర్ఎన్ హీట్ భారీ స్థాయిలో నిధులను సమీకరించబోతున్నది.

పసిడి డిమాండ్ ఢమాల్

- అధిక ధరలతో మార్కెట్‌లో అంతంతమాత్రంగానే గిరాకీ
- ఏప్రిల్-జూన్‌లో 149.7 టన్నులకు పరిమితం
- ప్రపంచ స్వర్ణ మండలి తాజా నివేదిక



ముంబై, జూలై 30: బంగారానికి ధరల సెగ తగిలింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయంగా గోల్డ్ డిమాండ్ 149.7 టన్నులకే పరిమితమైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5 శాతం తగ్గింది. అధిక ధరలే ఇందుకు కారణమని మంగళవారం విడుదలైన ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) నివేదిక తెలియజేసింది. ఈ క్రమంలోనే నిరుడు ఏప్రిల్-జూన్‌లో 158.1 టన్నులుగా పసిడికి గిరాకీ ఉన్నట్టు 'క్యూ2 2024 గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్' రిపోర్ట్‌లో పేర్కొన్నది. కాగా, పరిమాణంపరంగా డిమాండ్ తగ్గినప్పటికీ దాని విలువ మాత్రం 17 శాతం పెరిగింది. నిరుడు ఏప్రిల్-జూన్‌లో అమ్ముడైన పుత్తడి విలువ రూ.82,530 కోట్లుగా ఉంటే.. ఈసారి అది రూ.93,850 కోట్లుగా ఉన్నది.

సగటు ధర..

గడిచిన ఏప్రిల్-జూన్ వ్యవధిలో 24 క్యారెట్ తులం బంగారం ధర ఏకంగా రూ.74,000 దాటేసింది. దీంతో ఈ 3 నెలల్లో సగటు ధర వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), దిగుమతి సుంకం లేకుండా రూ.62,700.5గా నమోదైంది. పోయిన ఏడాది ఏప్రిల్-జూన్‌లో రూ.52,191.6గానే ఉండటం గమనార్హం. ఇక డాలర్ల లెక్కన చూసినా 1,975.9 డాలర్ల నుంచి 2,338.2 డాలర్లకు పెరిగింది. గుడి పాడ్వా, అక్షయ తృతీయ వంటివి కూడా కొనుగోళ్లను పెంచలేకపోయాయని డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన్ అభిప్రాయపడ్డారు.

ముఖ్యాంశాలు

- ఈ ఏప్రిల్-జూన్‌లో దేశంలోకి జరిగిన మొత్తం బంగారం దిగుమతులు 196.9 టన్నులు. నిరుడుతో చూస్తే 8 శాతం ఎక్కువ. నాడు 182.3 టన్నులే.
- రీసైకిల్డ్ గోల్డ్ 39 శాతం క్షీణించి 23 టన్నులకు పరిమితం. గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో 37.6 టన్నులుగా ఉన్నది.
- అధిక ధరలు, సాధారణ ఎన్నికలు, పెరిగిన ఉష్ణోగ్రతల నడుమ నగల డిమాండ్ 17 శాతం పడిపోయి ఈ ఏప్రిల్-జూన్‌లో 106.5 టన్నులుగానే ఉన్నది. క్రిందటిసారి 128.6 టన్నులు.
- బంగారంపై పెట్టిన పెట్టుబడులు ఈసారి 47.1 టన్నులుగా ఉన్నాయి. నిరుడు ఏప్రిల్-జూన్‌లో 29.5 టన్నులే. ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాలే ఇందుకు కారణం.
- అంతర్జాతీయంగా గోల్డ్ డిమాండ్ గత 3 నెలల్లో 1,258.2 టన్నులుగా ఉన్నది. 4.16 శాతం పెరిగింది. గరిష్ఠ ధర 2,427 డాలర్లుగా ఉన్నది.

చిత్రం

తంగం అంతరంగం హాయిగా..

'ఆర్ఆర్ఆర్' వచ్చి రెండేండ్లు నిండి మూడో ఏడు నడుస్తున్నది. ఇంకా ఎన్టీఆర్ నుంచి సినిమా రాలేదు. ఆయన అభిమానుల్ని బాధిస్తున్న విషయం ఇది. తారక్ మాత్రం ఖాళీగా లేకుండా ఇటు 'దేవర'తో అటు 'వార్'తో బిజీబిజీగా ఉన్నారు. ఎట్టకేలకు 'దేవర-1' షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ఈ సినిమాతో ఫ్యాన్స్‌కి వండర్‌ఫుల్ ట్రీట్ ఇచ్చేందుకు దర్శకుడు కొరటాల శివ సిద్ధమవుతున్నారు. తాజాగా ఎన్టీఆర్, జాన్వీకపూర్‌లపై ఓ అద్భుతమైన రొమాంటిక్ సాంగ్‌ని చిత్రీకరించారు కొరటాల. ఈ పాటను త్వరలోనే మేకర్స్ విడుదల చేయనున్నారు. రామజోగయ్యశాస్త్రి ఈ పాట రాశారు. తాజాగా ఆయన తన ఎక్స్‌లో (ట్విటర్) ఈ పాట గురించి స్పందించారు. 'తంగం అంతరంగం హాయిగా ఉయ్యాలలూగుతున్నట్టుంటుంది.. ఇప్పుడే విన్నా.. అతి త్వరలో సాంగ్ వచ్చేస్తోంది.. వెయిట్ చేసినందుకు మంచి ఫలితం ఉంటుంది.' అనేది ఈ ట్వీట్ సారాంశం. మొత్తానికి ఒక్క ట్వీట్‌తో అభిమానుల్లో అంచనాలు పెంచేశారు రామజోగయ్యశాస్త్రి. ఇందులో జాన్వికపూర్ పాత్ర పేరు 'తంగం'. ఆమె పేరు మీదే ఈ పాట నడుస్తుందని శాస్త్రి క్లారిటీ ఇచ్చేశారు. తంగం అంటే తమిళంలో బంగారం అని అర్థం. ఏదేమైనా సెప్టెంబర్ చివరివారంలో సినిమా విడుదల కానుంది. ఇది హిట్ అయిన వెంటనే 'దేవర 2' షూటింగ్ మొదలవుతుంది. ఇందులో సైఫ్‌అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే.

సొంతంగా డబ్బింగ్

చెప్పేసింది

సినిమా విడుదలకు ముందే స్టార్ స్టేటస్‌ని సొంతం చేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం ఈ అందాలభామ డేట్స్ కోసం నిర్మాతలు క్యూ కట్టారనేది ఫిల్మ్‌వర్గాల టాక్. రవితేజ హీరోగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్' ద్వారా ఈ ముద్దుగుమ్మ కథానాయికగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 15న సినిమా విడుదల కానుంది. అందుకే మిగిలివున్న వర్కుని చకచకా పూర్తి చేస్తున్నారు చిత్రబృందం. తాజాగా భాగ్యశ్రీ తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పేసుకొని తన బాధ్యతను పూర్తి చేసేసుకుంది. తన మాతృభాష తెలుగు కాకపోయినా కష్టపడి నేర్చుకొని తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పడంతో అందరూ భాగ్యశ్రీని అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఆమె డెడికేషన్ని ప్రశంసిస్తున్నారు. ఇప్పటివరకూ విడుదలైన ప్రచారచిత్రాల్లో భాగ్యశ్రీ బోర్సే స్క్రీన్ ప్రెజెన్స్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిందని, ఎక్కడ చూసినా ఆమె ఫొటోలే వైరల్ అవుతున్నాయని, విడుదలకు ముందే టాలీవుడ్ అప్ కమింగ్ క్రేజీ హీరోయిన్ అంటూ ఆమెను కొనియాడుతున్నారని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

పుష్పరాజ్ ఫినిషింగ్ టచ్ ?

ఆగస్ట్‌లో విడుదలకావాల్సిన 'పుష్ప 2' సినిమాను డిసెంబర్ 6కి వాయిదా వేయడంతో బన్నీ ఫ్యాన్సంతా డీలా పడిపోయారు. విడుదల ఆలస్యం అవుతున్నా.. ఈ సినిమా క్రేజ్ మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్ 'పుష్ప.. పుష్ప..' సాంగ్ యూట్యూబ్‌లో రికార్డులు సృష్టిస్తున్నది. విడుదలైన అన్ని భాషల్లో కలిపి 150 మిలియన్ వ్యూస్ సొంతం చేసుకున్నది. ఈ సందర్భంగా 'పుష్ప2' టీమ్ ఆనందం వెలిబుచ్చారు. కొన్ని రోజుల క్రితం షూటింగ్‌కి కాస్త గ్యాప్ ఇచ్చి, గడ్డాన్ని కూడా ట్రిమ్ చేసుకొని, తన కుటుంబంతో విహారయాత్రకు వెళ్లారు బన్నీ. 'పుష్ప2' కోసం పెంచిన గడ్డాన్ని ట్రిమ్ చేయడంతో అల్లు అర్జున్, సుకుమార్‌ల మధ్య మనస్పర్థలు వచ్చాయంటూ స్టోరీలు వెలువడ్డాయి. వాటికి చెక్ పెడుతూ.. మళ్లీ ఫుల్ గడ్డంతో ఆగస్ట్ తొలివారం నుంచి 'పుష్ప2' షూటింగ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు బన్నీ. ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీలో బన్నీ లేని సన్నివేశాలను దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. ఆగస్ట్ తొలివారం నుంచి బన్నీతో క్లైమాక్స్‌ని చిత్రీకరించనున్నట్టు సమాచారం.

కేవలం క్లైమాక్స్‌కి 8కోట్లు

నందమూరి కల్యాణ్‌రామ్ ఇప్పటికి హీరోగా 20 సినిమాలు పూర్తి చేశారు. ఆయన 21వ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. 8కోట్ల ఖర్చుతో కల్యాణ్‌రామ్ కెరీర్లోనే అత్యంతభారీగా ఈ సినిమా క్లైమాక్స్‌ని మేకర్స్ పూర్తి చేశారు. కేవలం క్లైమాక్స్‌కి 8కోట్లు ఖర్చు చేయడం కల్యాణ్‌రామ్ కెరీర్‌లో ప్రథమం. హైదరాబాద్ శివార్లలో.. బ్రహ్మకడలి మ్యూసీవ్‌గా డిజైన్ చేసిన భారీ సెట్‌లో, యాక్షన్ కొరియోగ్రాఫర్ రామకృష్ణ పర్యవేక్షణలో ఈ క్లైమాక్స్‌ని చిత్రీకరించారు. ప్రముఖ తారాగణంతోపాటు వెయ్యిమంది జూనియర్ ఆర్టిస్టులు కూడా ఈ క్లైమాక్స్ సీక్వెన్స్‌లో పాల్గొనడం విశేషం. సినిమాకే ఈ క్లైమాక్స్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత విజయశాంతి ఇందులో ఐపీఎస్ అధికారిగా కమాండింగ్ కేరక్టర్ చేస్తుండటం మరో విశేషం. సోహైల్‌ఖాన్, సాయిమంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సమర్పణ: ముప్పా వెంకయ్య, నిర్మాణం: అశోక్ క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.

చెప్పిన దానికంటే అద్భుతంగా తీశాడు

' సందర్భాన్ని బట్టి మనిషి ప్రవర్తన ఉంటుంది. సైలెంట్‌గా ఉండే వ్యక్తిని వైలెంట్‌గా మార్చేది సందర్భమే. ఈ కథలో అలాంటి సిట్యుయేషనే ఉంటుంది. ఓ మామూలు కుర్రాడి జీవితంలో ఎదురైన సంఘటనలు అతడ్ని ఎలా మార్చాయి? అనేదే ఈ సినిమా కథ.' అని నిర్మాత మల్కాపురం శివకుమార్ అన్నారు. రాజ్‌తరుణ్ హీరోగా ఎ.ఎస్.రవికుమార్‌చౌదరి దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'తిరగబడరా సామీ'. ఆగస్ట్ 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మాల్కాపురం శివకుమార్ విలేకరులతో ముచ్చటించారు. 'భార్యాభర్తలు మూడుముళ్ల బంధానికి ఏ విధంగా కట్టుబడి ఉండాలో చెప్పే చిత్రమిది. రవికుమార్‌చౌదరి కథ చెప్పినప్పుడు సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశా. చెప్పినదానికంటే బాగా తీశాడు. రాజ్‌తరుణ్‌కి సరిగ్గా సరిపోయే కథ ఇది. తగ్గట్టే అద్భుతంగా నటించాడు. అలాగే మన్నారా చోప్రా నెగిటీవ్ షేడ్స్ ఉండే కేరక్టర్‌ని చాలాబాగా చేసింది. ఈ సినిమా షూటింగ్ ఎక్కువ శాతం మా సొంత ప్రాంతమైన జహీరాబాద్‌లో చేశాం. ప్రతిరోజూ షూటింగ్‌కి వందలమంది వస్తుండేవారు. చాలా సరదాగా ఈ షూటింగ్ జరిగింది' అని తెలిపారు శివకుమార్. దివంగత నటుడు శ్రీహరి పోద్బలంతో 'భద్రాద్రి' సినిమాతో నిర్మాతనయ్యానని, ఆ సినిమాతోనే ఇప్పటి మెగా దర్శకుడైన కె.ఎస్.రవీంద్ర(బాబీ)ని రైటర్‌గా పరిచయం చేశానని, ఇంకా కార్తీక్ ఘట్టమనేనిని కూడా తానే పరిచయం చేశానని, ఈ సినిమా ద్వారా మాల్వి మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయం అవుతున్నదని, తన ప్రతి సినిమా ద్వారా కొత్తవారిని పరిచయం చేయడం తనకిష్టమని శివకుమార్ పేర్కొన్నారు.

తుది వరకూ బీఆర్ఎస్‌లోనే..

ప్రస్తుతం మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా చేస్తున్నాను. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్‌గారి ఆశీర్వాదంతో ఈ బాధ్యత స్వీకరించా. ఇంకా నా పదవీకాలం 8 నెలలు ఉంది. కొందరిలాగా పార్టీలు మారే తత్వం కాదు నాది. కేసీఆర్‌సార్‌తో నా బంధం ఈనాటిది కాదు. ఆయన టీడీపీలో ఉన్నప్పట్నుంచీ ఆయనతో నడిచినవాడ్ని. ఎప్పటికీ ఆయనతోనే నడుస్తా.

క్వాలిటీ కంటెంట్‌కోసం ఎక్కువే ఖర్చు చేశా

'ఈ సినిమా కథ ముందుగా నేనే విన్నా. వెంటనే అడ్వాన్స్ ఇచ్చేశా. అంతగా నచ్చింది. ఆ తర్వాత అశ్విన్ దగ్గరకు తీసుకెళ్లా. ఆయన అయిదు నిమిషాల్లో ఓకే చేశారు. ఇది నిజంగా అద్భుతమైన కథ. ఇందులో చాలా లేయర్లు ఉంటాయి. ఇది ఒక జానర్ అని చెప్పడానికి లేదు. ఇందులో ఆయిదారు జానర్లుంటాయి. అందరినీ ఆకట్టుకునే అంశాలుంటాయి. ట్విస్టులు ఉంటాయి. క్వాలిటీ కంటెంట్ కోసం అనుకున్న దానికంటే కాస్త ఎక్కువే ఖర్చు చేశాను.' అని నిర్మాత మహేశ్వర్‌రెడ్డి మూలి అన్నారు. అశ్విన్‌బాబు హీరోగా అప్సర్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'శివంభజే'. దిగంగనా సూర్యవంశీ కథానాయిక. ఈ సినిమా ఆగస్ట్ 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మహేశ్వర్‌రెడ్డి విలేకరులతో ముచ్చటించారు. 'ఆగస్ట్ 1 నా పుట్టినరోజు. అలాగే హీరో అశ్విన్ బాబు పుట్టినరోజు కూడా. ఈ కారణంగా ఈ డేట్‌ని ఫిక్స్ చేయలేదు. నేను పంపిణీదారుడ్ని కూడా కావడంతో అన్ని విధాలుగా ఆలోచించి ఈ డేట్‌ని ఫిక్స్ చేశాను. ఇక ముమ్ముందు మా సంస్థ నుంచి పెద్ద సినిమాలు రాబోతున్నాయి.' అని తెలిపారు మహేశ్వర్‌రెడ్డి. మ్యూజిక్కే ఈ సినిమాకు హీరో అని, సంగీత దర్శకుడు వికాస్ అద్భుతమైన సంగీతం ఇచ్చారని, ఆర్.ఆర్.తో సినిమాకు ప్రాణం పోశారని ఆయన తెలిపారు. అగ్రహీరో వెంకటేశ్ ఈ సినిమా ట్రైలర్ చూసి అభినందించారని, త్వరలో 'ఐఐటీ కృష్ణమూర్తి' టీమ్‌తో ఒక సినిమా. కార్తికేయతో ఒక సినిమా చేయాలనుకుంటున్నామని మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.

కాలం రాసిన కథలు

ఎం.ఎన్.వి.సాగర్ స్వ